క్లుప్తంగా

కేంద్ర మంత్రులకు అర్బన్ ఎమ్మెల్యే శుభాకాంక్షలు





సుభాష్‌నగర్: కేంద్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

సీఎంను కలిసిన డీసీసీబీ చైర్మన్



సుభాష్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించారు. వరికి రూ.500 బోనస్ ఇవ్వడం, ఆగస్టు 15వ తేదీలోపు రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతాంగం తరపున సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పనుల పరిశీలన



ధర్పల్లి: మండలంలోని కొట్టల్‌పల్లి, హొన్నాజీపేట్, వాడీ, ధర్పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను మంగళవారం ఎంపీడీవో బాలకృష్ణ పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే ప్రైవేటు విద్యాసంస్థల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. నగర అధ్యక్షుడు గణేశ్, నగర ఉపాధ్యక్షులు శివ సంతోష్ ఉన్నారు.

గ్రామాల్లో బడిబాట



జక్రాన్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తొర్లికొండ, పడకల్, కొలిప్యాక్, జక్రాన్‌పల్లి, కలిగోట్, మునిపల్లి గ్రామాల్లో బడి బాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకున్నారు. జంగం అశోక్, సంకెపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పూర్తి చేయాలి



మాక్లూర్ : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆదేశించారు. మంగళవారం మండలంలోని కృష్ణనగర్, బోర్గాం (కె) గ్రామాల్లో ఆయన పాఠశాలల్లో పనులను పరిశీలించారు. కృష్ణనగర్‌లో మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ సరాపరా అవుతుందా లేదా అని తెలుసుకున్నారు. ఎంపీడీవో జె క్రాంతి, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్ రాయ్‌సింగ్, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, మనోహర్‌రావు, మాక్లూర్ జీపీ కార్యదర్శి రాకేష్ ఉన్నారు.

చెక్‌పోస్ట్ ఏర్పాటు

నవీపేట : మండలంలోని యంచ గ్రామంలో ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. బక్రీద్ నేపథ్యంలో గోవులను తరలిస్తారనే ఫిర్యాదులు రావడంతో ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- నగరంలో భారీ హోర్డింగ్‌లు
- ఈదురు గాలులు వస్తే అంతే సంగతులు

నిజామాబాద్ నాగారం: వివిధ రకాల ఉత్పత్తులను ప్రచారం చేసుకోవడానికి నగరంలో పెద్ద పెద్ద హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ భారీ హోర్డింగ్‌తో యాడ్స్ ప్రచారం ఒకవైపు అయితే మరో వైపు ప్రాణాలకు ముప్పు ఉంది. ఈదురు గాలులు వస్తే ఈ హోర్డింగ్‌లు కింద పడే అవకాశం ఉంది. వీటిలోని ఫ్లెక్సీలు గాలులకు చిరిగిపోయి వాహనదారులు, విద్యుత్ తీగలపై పడుతున్నాయి. నగరంలో ఎటు చూసినా భారీ హోర్డింగ్‌లే దర్శనమిస్తున్నాయి.

వివిధ రకాల ఉత్పత్తుల ప్రచార నిమిత్తం నగరంలో సుమారు 22 ఏజెన్సీలు 120వరకు భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశాయి. ఒక్కో ఏజెన్సీ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీకి ప్రతి ఏడాది సుమారుగా రూ.లక్షపైగా చెల్లించాల్సి ఉంటుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి ఫీజు చెల్లించకుండానే దర్జాగా హోర్డింగ్‌లో యాడ్స్ వేస్తున్నారు. ప్రచారం చేసుకునే వారి వద్ద యాడ్ ఏజెన్సీలు డబ్బులు తీసుకుంటున్నాయి. కానీ కార్పొరేషన్‌కు చిల్లి గవ్వ కట్టడం లేదు.



నగరంలోని బస్టాండ్ ప్రాంతంలో హోర్డింగ్

కరెంట్ సరఫరాకు అంతరాయం

నగరం నడిబొడ్డున హోర్డింగ్‌లు ఉండడంతో గాలులు వస్తే ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు సైతం ఎగిరిపోయే అవకాశం ఉంది. దీంతో భారీ గాలులు వీచినప్పుడు వాహనదారులు హోర్డింగ్‌లు ఉన్న ప్రాంతాల్లో భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. హోర్డింగ్‌లోని ఫ్లెక్సీలు విద్యుత్ వైర్ల మీద పడడంతో తరచుగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీంతో విద్యుత్ అధికారులు ప్రత్యేకంగా శ్రమించాల్సిన పరిస్థితి ఉంది. మంగళవారం హోర్డింగ్‌లోని ఫ్లెక్సీ విద్యుత్ తీగలపై పడితే టౌన్ -2 ఏడీఈ తోట రాజశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు శ్రమించి తొలగించారు.



విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

పర్యవేక్షణ చేయని అధికారులు

నగరంలో ఇష్టారాజ్యాంగా హోర్డింగ్‌లు వెలుస్తున్నాయి. ఏళ్ల తరబడిగా యాడ్ ఏజెన్సీలు ఫీజు చెల్లించకుండా కాలం వెల్లదీస్తున్నాయి. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతుంది.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అధ్యక్షురాలు రాజమణి

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఇంటిదీపం ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (మ్యాక్స్) ఆధ్వర్యంలో అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సభ్యులు ఆర్థికంగా ఎదగాలని సంఘం మండల అధ్యక్షురాలు బంగ్లా రాజమణి సూచించారు. మండలంలోని ఘన్‌పూర్ ఇస్లాంపురా షాదీఖానాలో మ్యాక్స్ 23వ మహాజన సభ రాజమణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ప్రస్తుతం మ్యాక్స్‌లో 1545 మంది సభ్యులు ఉండగా, వీరి వాటా ధనం రూ.72,46,800 ఉందన్నారు. మ్యాక్స్ సొంత నిధులు రూ.1,14,47,650 లు ఉండగా 838 మంది సభ్యులపై రూ.91,99,421 లు అప్పులు ఉన్నాయన్నారు. తీసుకున్న అప్పుల్లో ఇప్పటికే 97 శాతం చెల్లించి సంఘం అభివృద్ధికి సభ్యులు తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. 27 మంది సభ్యులకు ఎల్ఐసీ బీమా మెచ్యూరిటీ ద్వారా వచ్చిన రూ.2లక్షల 48వేలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాక్స్ మేనేజర్ సర్వోన్నతరావు, సిబ్బంది జీ సంతోషి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

బోధన్‌రూరల్ : అస్లెంబీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ సి. గోపాల్ రావు అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో వీహెచ్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందించాలని, సమస్యల పరిష్కరం కోసం కృషి చేయలన్నారు. వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, ఉపాధ్యక్షులు నారాయణ, సాయిలు, అబ్బయ్య, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాల్‌రావు

అంకాపూర్‌ను సందర్శించిన 'పొలాస' విద్యార్థులు

పెర్కిట్ : ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా అంకాపూర్‌ను సందర్శించారు. అంకాపూ ర్‌లోని వ్యవసాయ క్షేత్రాలను, విత్తన శుద్ధి కర్మగారాలను పరిశీలించారు. ఆదర్శ రైతు భాజన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సౌజన్య, ప్రజ్ఞ పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

ఖలీల్‌వాడి: ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి సంధ్యారాణి కోరారు. మంగళవారం ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో ఆర్ఎం జానీరెడ్డికి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో రద్దీ పెరిగిందన్నారు. కానీ బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే జిల్లాలోని చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదన్నారు. కులాస్‌పూర్ గ్రామానికి మోపాల్, డిచ్‌పల్లి వైపు నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శకుంతల, సహాయ కార్యదర్శి గౌరక్క, లలిత, అమూల్య, భాగ్య, సువర తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న మహిళలు

చక్కెర పరిశ్రమను ప్రభుత్వమే నడిపించాలి

ఖలీల్‌వాడి: జిల్లాలో మూతపడిన చక్కెర పరిశ్రమలను ప్రభుత్వం వెంటనే తెరిపించి నడిపించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. నగరంలోని కోటగల్లిలో గల ఎన్ఆర్‌భవన్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల తప్పుడు విధానాలతో జిల్లాలోని బోధన్, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. నాయకులు దేశెట్టి సాయిరెడ్డి, బి.సాయిలు, అగ్గు ఎర్రన్న, దేవన్న, డి.బన్నీ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూమయ్య

ప్రజలు యుద్ధాలు కోరుకోవడం లేదు

ఆర్మూర్ : ప్రజలు యుద్ధాలను కోరుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్వేష్ అన్నారు. మండలంలోని మైత్రి గార్డెన్స్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి రాజకీయ విజ్ఞాన తరగతుల రెండో రోజు మంగళవారం కొనసాగాయి. ఆయన జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు- మన కర్తవ్యం అనే అంశంపై ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాదుల మధ్య నెలకొన్న పోటీయే ప్రపంచ యుద్ధాలకు కారణమయ్యాయన్నారు. ఈ తరగతుల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్, ఎస్ నాగేశ్వరరావు, నరేందర్, అనిల్, పృథ్వీ, అఖిల్, సాయి, సురేష్, గణేశ్, అనిల్, అషూర్, వెంకటేష్, దీపిక, కావ్య, సీతారాం, తిరుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్వేష్

సమాచారం..

నేడు తాగునీటి సరఫరా బంద్

నిజామాబాద్‌నాగారం: జానకంపేట గ్రామం వద్ద మెయిన్ ఫీడర్ పైపులైన్ లీకేజీ రిపేరింగ్‌తో బుధవారం నగరంలో తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుభాష్ నగర్, మహాలక్ష్మినగర్, చంద్రశేఖర్ కాలనీ, ఖలీల్‌వాడి, పోచమ్మగల్లీ, గౌతంనగర్, నిజాంకాలనీ, గంగస్తాన్, మాలపల్లి, ఆటోనగర్, ఎల్లమ్మగుట్ట, కంఠేశ్వర్ (బ్యాంకు కాలనీ), నాందేవ్ వాడ, మిర్చి కాంపౌండ్, ఇస్లాంపుర, కోజకాలనీ, గోల్ హనుమాన్, హమల్‌వాడి ప్రాంతాల్లో నీటిసరఫరా బంద్ ఉంటుందని ప్రజలు గమనించాలన్నారు. ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజామాబాద్ నాగారం: నగరంలోని డీ-2 సెక్షన్ పరిధిలో 11 కేవీ సీసీ ఫీడర్ పరిధిలో బుధవారం మరమ్మతులు చేపడుతున్నట్లు టౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందన్నారు. ఓల్డ్ కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్, గొల్ల నర్సయ్య హోటల్, మాక్స్ టైలర్, ఎల్ఐసీ ఆఫీస్, ఎల్లమ్మ గుట్ట, ఆర్టీసీ కాలనీలలో కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్కూల్ యూనిఫాంల అందజేత



నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్కాపూర్ (ఎం), గాంధీనగర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు మంగళవారం డీఆర్‌డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమ యూనిఫాంలను అందజేశారు. మల్కాపూర్ పాఠశాలకు 77 జతలు, గాంధీనగర్ పాఠశాలకు 57 జతలు అందజేశారు. ఏపీఎం మహేష్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలపై కమిషనర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరంలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడంపై మున్సిపల్ కమిషనర్ మకరందు సీరియస్ అయ్యారు. మంగళవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఖలీల్‌వాడీ ప్రాంతంలో ఎక్కడెక్కడ నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్నారో విచారణ చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నోటీసులు ఇస్తూ నివేదిక ఇవ్వాలన్నారు.

దంచికొట్టిన వర్షం

నిజామాబాద్ రూరల్: మండలంలోని తిర్మన్‌పల్లి, ఆకుల కొండూర్ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం చల్లబడింది. దీంతో ఉక్కబోతతో సతమతం అవతున్న ప్రజలకు ఉపశమనం లభించింది.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు





నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్లారం శివారులో నిర్మలాశ్రమంలోని దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు సాంబయ్య శాస్త్రి, గజవాడ ఆగమయ్యగుప్తా, రామదత్త శర్మ, శ్రీకాంత శర్మ పాల్గొన్నారు.

నేటి చిత్రం..



గుంతలమయంగా రోడ్డు

నిజామాబాద్ నగరంలో నిత్యం రద్దీగా ఉండే ఖలీల్‌వాడిలో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు ఆ గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

బడుల్లో నత్తనడకన పనులు

పట్టించుకోని అధికారులు



ఘన్‌పూర్ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల వరండా పరిస్థితి



రేకులు లేచిపోయిన వంటగది

డిచ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. బుధవారం(నేడు) బడులు తెరుచుకోనున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం కాకముందుగానే పాఠశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని ప్రతి యేటా రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పాఠశాలల్లో సమస్యలు అలాగే ఉంటున్నాయి.ఈ సారి కూడా అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట అభివృద్ధి, మరమ్మతు పనులు చేపట్టారు. అయితే ఉన్నతాధికారులు ఎన్ని ప్రకటనలు చేసినా క్షేత్రస్థాయిలో పనులు మాత్రం పూర్తి కాలేదు.

ఒక్క బడిలో కూడా..

డిచ్‌పల్లి మండలంలో మొత్తం 64 పాఠశాలలకుగానూ 44 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో నాలుగు రకాల అభివృద్ధి పనుల కింద రూ.2కోట్ల 51 లక్షల 35వేలు నిధులు మంజూరయ్యాయి. ఇందులో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు తొలుత పది శాతం నిధులు రూ.25లక్షలు విడుదల చేశారు. ముఖ్యంగా ఎలక్ట్రిషియన్, డ్రింకింగ్ వాటర్, మైనర్ రిపేర్స్, టాయిలెట్ వర్క్ పనులు చేస్తారు. అయితే 44 స్కూళ్లకు ఏ ఒక్క స్కూల్లో కూడా పనులు పూర్తి కాలేదు. పలు పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తే ఉన్నతాధికారుల ఒత్తిడిని భరించలేక మండల అధికారులు వారిని బతిమిలాడి పనులు ప్రారంభింపజేసినట్లు సమాచారం. దీంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీనికి తోడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం శాపంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన 'మన ఊరు – మన బడి' పథకం పనులు ఇలాగే అసంపూర్తిగా మిగిలాయి. పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. అలాగే ఇన్‌చార్జి ఎంఈవో ఉండటంతో పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట సైతం మొక్కుబడిగా నిర్వహించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



నిజామాబాద్ నాగారం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సిరివెన్నెల గ్రీన్ సొసైటీ వ్యవస్థాపకుడు రావుట్ల జనార్దన్ అన్నారు. తన వంతుగా ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లోని అడవులలో 4.50 లక్షల పండ్ల విత్తన బంతులు చల్లినట్లు చెప్పారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,000	వెండి (కిలో)	90,500
22 క్యారెట్స్	66,230	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	45	75	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	80	120
జీరకాయ	60	90	దోసకాయ	35	60
దొండకాయ	25	50	ఆలుగడ్డ	35	60
బీర్నీసుకాయ	100	120	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	80	గోబిపువ్వు	50	80
వంకాయ	35	60	బీట్‌రూట్	20	40
పాలకూర	35	60	కరివేపాకు	50	80
మెంతికూర	70	100	చామగడ్డ	60	100
కొత్తిమీర	120	150	గోరుచిక్కుడు	70	100
పుదీనా	80	100	చిక్కుడుకాయ	90	120
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మనమే(తెలుగు)-10.50, 01.45, 4.40.7.35.10.30
స్క్రీన్-2	రక్షణ(తెలుగు)-10.25 గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు)-1.30 7.30 - సత్యభామ(తెలుగు)-4.30 భజేవాయువేగం(తెలుగు)- 10.30
స్క్రీన్-3	లవ్‌మౌళి(తెలుగు)-10.40 బాడ్‌బాయ్స్(తెలుగు)-1.45,7.45 వెపన్(తెలుగు)-4.40 సత్యభామ(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మనమే(తెలుగు)-10.20, 10.20 ముంజ్య(హిందీ)-1.35 గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి(తెలుగు) -4.20 సత్యభామ(తెలుగు)-7.25
స్క్రీన్-2	బాడ్ బాయ్స్(తెలుగు)-10.30,4.30 మనమే(తెలుగు)- 1.15,7.15 బాడ్ బాయ్స్(ఇంగ్లీష్)- 10.30
స్క్రీన్-3	సత్యభామ(తెలుగు)-11.25 , 10.40 భజే వాయువేగం (తెలుగు)-2.20 వెపన్(తెలుగు)- 5.15 ముంజ్య(హిందీ)- 7.55
స్క్రీన్ -4	గోల్డ్ నెం.1(తెలుగు)-10.30 లవ్‌మౌళి(తెలుగు)-1.20 గంగం గణేశా(తెలుగు)-4.25 రక్షణ(తెలుగు)-7.30 గ్యాంగ్ ఆఫ్ గోదావరి(తెలుగు)- 10.30
దేవి	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు)
నటరాజ్	రక్షణ(తెలుగు)-11.00 6.00 వెపన్(తెలుగు)-2.00 9.00
విజయ్	మనమే (తెలుగు)